ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 3 జూన్ 2024 | 5



ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	34	30



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



కౌంటింగ్‌కు...

సర్వ సన్నద్ధం

- ఓట్ల లెక్కింపునకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, సిబ్బంది కేటాయింపు
- 18వేల పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్‌కు ప్రత్యేకంగా టేబుళ్లు
- చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం నియోజకవర్గాల వారీగా అధికారులు, సిబ్బందిని నియమించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని, 20 మంది చొప్పున క్లాస్-4 సిబ్బందిని నియమించారు.

రామచంద్రపురం: 15 మంది సూపర్‌వైజర్లు, 15 మంది పరిశీలకులు, 15 మంది మైక్రో సూపర్‌వైజర్లు.

ముమ్మిడివరం: 21 మంది సూపర్‌వైజర్లు, 21 మంది పరిశీలకులు, 21 మంది మైక్రో అబ్జర్వర్లు.

అమలాపురం: 21 మంది సూపర్‌వైజర్లు, 21 మంది అబ్జర్వర్లు, 21 మంది మైక్రో అబ్జర్వర్లు.

రాజోలు: 21 మంది సూపర్‌వైజర్లు, 21 మంది అబ్జర్వర్లు, 21 మంది మైక్రో అబ్జర్వర్లు.

పి.గన్నవరం: 18 మంది సూపర్‌వైజర్లు, 18 మంది అబ్జర్వర్లు, 18 మంది మైక్రో అబ్జర్వర్లు.

కొత్తపేట: 21 మంది సూపర్‌వైజర్లు, 21 మంది అబ్జర్వర్లు, 21 మంది మైక్రో అబ్జర్వర్లు.

మండపేట: 15 మంది సూపర్‌వైజర్లు, 15 మంది అబ్జర్వర్లు, 15 మంది మైక్రో అబ్జర్వర్లు.

జిల్లాలో 18వేల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పోస్టల్ బ్యాలెట్లు, సర్వీసు ఓటర్లు, హోం ఓటింగ్ ద్వారా ఓట్లు వేసిన మొత్తం 18వేల ఓట్లను లెక్కించేందుకు ప్రత్యేకంగా టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు కోసం ఒక టేబుల్, సర్వీసు ఓట్ల లెక్కింపు కోసం మరొక టేబుల్ ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మూడు రౌండ్లుగా విభజించామన్నారు. ఈ ఓట్ల లెక్కింపు పర్యవేక్షణకు సహాయ రిటర్నింగ్ అధికారులుగా ఉన్న తహసీల్దార్లు, వారి పరిధిలోని డిప్యూటీ తహసీల్దార్లను నియమించామన్నారు. కచ్చితత్వంతో ఓట్లు లెక్కించడానికి కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ సహాయకులు, సూక్ష్మ పరిశీలకులను నియమించామని కలెక్టర్ చెప్పారు.

కౌంటింగ్ ఏజెంట్ల నియామకంలో...

ఆ పార్టీ రూటే సెప 'రేటు'

అమలాపురం టౌన్, జూన్ 2: అత్యంత కీలకమైన ఓట్ల లెక్కింపులో కౌంటింగ్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. నియోజకవర్గాల వారీగా ఏర్పాటుచేసిన టేబుళ్లకు అనుగుణంగా కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను నియమించుకోవాల్సి ఉంది. కానీ వారి నియామకంలో ఆ పార్టీ రూటే 'సెప రేటు' అనిపించుకుంది. జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, జనసేన, వైసీపీ, కాంగ్రెస్‌లతో పాటు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. జిల్లాకు సంబంధించి చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదుల్లో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున పది నుంచి 14 మందిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవచ్చు. కానీ ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎంతో ముందస్తు వ్యూహంతో ఎక్కడెక్కడో ఉన్నవారిని సైతం వెతికి మరీ తీసుకువచ్చి అధికార వైసీపీ పార్టీ స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిపిన సంఘటనలు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఉన్నాయి. ఇప్పుడా అభ్యర్థుల తరఫున పోలింగ్ ఏజెంట్లను నియమించుకునేది ఆ పార్టీ నాయకులే. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున 50 నుంచి 75 మంది వరకు ఆ పార్టీ నాయకులే కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకున్నారు. మరికొందరు ఇతర అభ్యర్థులు కూడా పోటీలో ఉండడంతో వారి తరఫున కౌంటింగ్ ఏజెంట్లుగా వెళ్లేందుకు కూడా మా రూటే 'సెప రేటు' అన్నట్టుగా ముందుకు సాగుతున్నారు. అయితే ఎన్నికల అధికారుల దృష్టిలో వారంతా స్వతంత్ర అభ్యర్థుల తరఫున కౌంటింగ్ ఏజెంట్లుగానే ఉన్నారు. కానీ వారు వెళ్లేది మాత్రం అధికార పార్టీ కౌంటింగ్ ఏజెంట్లుగానే. కౌంటింగ్ కేంద్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల అధికారులు ఇప్పటికే ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిబంధనలు అతిక్రమిస్తే కౌంటింగ్ ఏజెంట్లను తొలగించే అధికారం రిటర్నింగ్ అధికారులకు అప్పగించారు. కాగా ప్రధాన రాజకీయ పార్టీలు తమ తమ అభ్యర్థుల కోసం నియమించుకున్న కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇవ్వడం కూడా పూర్తయ్యింది. స్వతంత్ర అభ్యర్థులెవరూ ఆ తరహా శిక్షణ ఇచ్చే పరిస్థితి లేదు. ఏదేమైనా అధికార వైసీపీ నాయకులు చెబుతున్నట్టుగా కౌంటింగ్ ఏజెంట్లు పూర్తి అప్రమత్తతతో ఉండాల్సిందే.

ఉద్యోగులను వెంటాడుతున్న భయం

అమలాపురం టౌన్, జూన్ 2: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను భయం వెంటాడుతోంది. మరో రోజు గడిస్తే చాలు ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతాయో తెలుస్తుంది. అయినా వారిలో ఆ భయం మాత్రం పోవడం లేదు. గతంలో ఎన్నడూ చూడని విధంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోటెత్తి మరీ ఓటెత్తారు. కొందరు ఉద్యోగులైతే కసితో ఓటేశామని బహిరంగంగానే చెప్పారు. అధికార వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎన్నో అవమానాలు, అరెస్టులు, గృహ నిర్బంధాలు ఎదుర్కోవడంతో ఆ పరిస్థితి కొత్త ప్రభుత్వంలో ఉండకూడదని వారంతా భావించి ఉండవచ్చు. పోలీసులు పాఠశాలలకు వచ్చి మరీ ఎటువంటి ఉద్యమాల్లో పాల్గొనకూడదని నోటీసులు అందించడాన్ని ఉపాధ్యాయులు జీర్ణించుకోలేకపోయారు. విద్యార్థుల ఎదుటే పోలీసుల నుంచి నోటీసులు తీసుకోవలసి రావడం ఏమిటని మదనపడ్డారు. తాము ఎదుర్కొన్న ఇబ్బందులకు అత్యధిక శాతం మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు రూపంలో బదులిచ్చారు. అంతవరకు బాగానే ఉంది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెలువడినా కూడా వారిని భయం ఇంకా వెంటాడుతూనే ఉంది. మళ్లీ అదే ప్రభుత్వం వస్తే తమ పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. వైసీపీకి కట్టుబడ్డ ఉద్యోగులు మాత్రం ఆ పార్టీకి ఓటు వేస్తే అత్యధికులు వ్యతిరేక ఓటు వేయడమే ఇందుకు కారణం. మార్పు అనేది మాలోనే వచ్చిందా. లేక సామాన్య ఓటర్లలో కూడా వచ్చిందా లేదా అన్న అనుమానాలు వారిని వెంటాడుతున్నాయి. యువతరం సైతం ప్రభుత్వ వ్యతిరేకతను చాటే స్థాయిలోనే ఓటేశామని చెబుతున్నా సంక్షేమ పథకాల లబ్ధి పొందిన మహిళలు, ఇతరులు ఎలా ఓటు వేశారోనని మదనపడుతున్నారు. మరో రోజు గడిస్తే ఓటర్ల నాడి ఎలా ఉందో తెలుస్తుంది. ఉద్యోగులను భయపెట్టి అణగదొక్కే ప్రభుత్వం వస్తుందా లేక అభయమిచ్చే ప్రభుత్వం వస్తుందో తెలిసే సమయం ఆసన్నమైంది.

సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై ఆశ వదులుకున్నామని వైసీపీ నాయకులే చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, చిరుద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉండడం వల్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై అంత నమ్మకం లేదంటున్నారు. ఉపాధ్యాయుల ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేయడం, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అంగన్‌వాడీలు నెలల తరబడి ఉద్యమించడం, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడం... ఇలా ఎన్నో కారణాల వల్ల ఆ ఓట్లు కోల్పోయామన్న వాదన వారి నుంచే వినిపించడం విశేషం.

రేపు మధ్యాహ్నం 4 గంటలకే

తొలి ఫలితం

- రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో ముందస్తుగా...
- ముమ్మిడివరం, కొత్తపేట నియోజకవర్గాల్లో ఆలస్యంగా....

అమలాపురం టౌన్, జూన్ 2: నాల్గవ తేదీ మధ్యాహ్నం నాలుగు గంటలకే తొలి నియోజకవర్గ ఫలితం వెలువడనుంది. జిల్లాలోని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ ఫలితం తొలుత వెలువడనుంది. ముమ్మిడివరం, కొత్తపేట నియోజకవర్గాల్లో ఫలితాలు ఆలస్యంగా వెలువడనున్నాయి. చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల లోకేషన్ ఇన్‌చార్జిగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లును నియమించారు. అధికారికంగా ప్రకటించిన వివరాల ప్రకారం ఏయే నియోజకవర్గాల్లో ఫలితాలు ఏ సమయానికి వెలువడే అవకాశం ఉందో తెలిపారు.

రామచంద్రపురం: 239 పోలింగ్ కేంద్రాలకు 10 టేబుళ్లను ఏర్పాటుచేసి 24 రౌండ్లలో ఓట్ల లెక్కింపును 9 గంటల వ్యవధిలో పూర్తి చేసేలా అంచనాలు రూపొందించారు.

ముమ్మిడివరం: 268 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుళ్లు. 27 రౌండ్లలో ఓట్ల లెక్కింపునకు పది గంటల సమయం.

అమలాపురం: 235 పోలింగ్ కేంద్రాలకు 12 టేబుళ్లు, 24 రౌండ్ల ఓట్ల లెక్కింపునకు 9 గంటల సమయం.

రాజోలు: 205 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుళ్లు. 21 రౌండ్లు. ఓట్ల లెక్కింపునకు 8 గంటల సమయం.

పి.గన్నవరం: 212 పోలింగ్ కేంద్రాలకు 12 టేబుళ్లు. 22 రౌండ్ల ఓట్ల లెక్కింపునకు 8 గంటల సమయం.

కొత్తపేట: 262 పోలింగ్ కేంద్రాలకు 10 టేబుళ్లు. 27 రౌండ్లలో ఓట్ల లెక్కింపునకు 10 గంటల సమయం.

మండపేట: 223 పోలింగ్ కేంద్రాలకు 10 టేబుళ్లు. 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపును 9 గంటల్లో పూర్తి చేస్తారు.

ఆ మూడు రోజులూ డ్రై డే

మద్యం దుకాణాల మూసివేతకు ఆదేశం

అమలాపురం టౌన్, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు డ్రై డేగా ప్రకటించి మద్యం విక్రయాలు నిలుపుదల చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ చట్టాన్ని అనుసరించి ఏపీ రాష్ట్ర బ్రోవరీస్ కార్పొరేషన్ లిమిటెడ్ జిల్లాలోని మద్యం దుకాణాల రిటైల్ అవుట్‌లెట్లు, బార్‌లను మూసివేయాలని ఆదేశించామన్నారు. నిబంధనల ప్రకారం కల్లు దుకాణాలు, రిటైల్ అవుట్‌లెట్లు, రెక్టిఫైడ్ స్పిరిట్, మిథనాల్ అమ్మకాలను 5వ తేదీ వరకు నిర్వహించరాదన్నారు. ప్రజా సంరక్షణలో భాగంగా మద్యం విక్రయాలపై నిషేదం విధించినట్టు కలెక్టర్ చెప్పారు.

పంట పొలాలకు సాగునీరు విడుదల

ఆత్రేయపురం, జూన్ 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ప్రధాన పంట కాలువలకు సాగునీరు విడుదల చేశారు. ఆదివారం ఉదయం లొల్ల లాకులు బ్యాంకు కెనాల్ ద్వారా ప్రధాన కాలువలకు సాగునీరు విడుదల చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాలువలను మూసివేసిన అనంతరం శనివారం గోదారమ్మకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి సాగునీరు విడుదల చేసిన సంగతి తెలిసిందే. 13 కిలోమీటర్ల ప్రవాహం అనంతరం లొల్ల లాకుల వద్ద అమలాపురం, ముక్తేశ్వరం, పి.గన్నవరం, బ్యాంకు కెనాల్ కాలువలకు ఇరిగేషన్ ఏఈ పి.సత్యనారాయణ తన సిబ్బందితో గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. రైతులు త్వరితగతిన నాట్లు వేసుకోవాలన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేస్తామని ఏఈ చెప్పారు.





అమలాపురంలో సహస్ర హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న మహిళలు, చంద్రశేఖర్ బృందం

రామదూత అతులిత బలధామా...

అంజని పుత్ర పవన సుత నామా

అమలాపురంలో వైభవంగా సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ

అమలాపురం టౌన్, జూన్ 2: రామదూత అతులిత బలధామా.. అంజనిపుత్ర పనవసుత నామా... అంటూ సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం గండు వీధిలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో వేలాది మంది హనుమద్భక్తితో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. తొలుత ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్-గీత దంపతులు గణపతి పూజ నిర్వహించారు. హనుమత్ లక్ష్మణ సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి స్వామివార్లకు అదే వేదికపై పూజలు జరిపారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న శృంగవృక్షం శ్రీదత్త పీఠాధిపతి శ్రీసాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ, హిమాలయ గురువు శ్రీస్వామి సూర్యభాస్కరేంద్ర సరస్వతి, వాసుదేవానంద స్వామీజీ సనాతన ధర్మాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. హనుమాన్ చాలీసా విశిష్టతను వివరించారు. వీహెచ్‌పీ ఉత్తరాంధ్ర ప్రాంత కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్ హిందూ ధర్మ రక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రముఖ కళాకారుడు మట్టపర్తి చంద్రశేఖర్ శిష్య బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞాన్ని ప్రారంభించారు. ఒకే వేదికపై వేలాది మంది భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేస్తుండగా స్వామీజీలు వారిని ఉత్తేజపరిచారు. చిన్నారులు పలు రకాల వేషధారణలతో ఆకట్టుకున్నారు. అఖండ అన్నసమారాధన జరిపారు. ఆత్మీయ అతిథి మెట్ల రమణబాబు, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి, కోశాధికారి నూలు శ్యామల, రత్నకుమార్, ఉలిశెట్టి గంగాధర్, గొవ్వాల అచ్యుతరామయ్య శిరంగు నాయుడు, రాళ్లపల్లి పాపయ్యశర్మ, జి.సుభద్ర, వాణి, మానేపల్లి అయ్యాజీ వేమా, నల్లా పవన్‌కుమార్, డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



వీరనారి వేషంలో ఆకట్టుకున్న బాలిక, గదతో బాలుడు



ఆంజనేయస్వామికి పూజ చేస్తున్న కుమార్‌శంకర్‌గౌడ్ దంపతులు



హనుమాన్‌చాలీసా పారాయణ మహా యజ్ఞంలో పాల్గొన్న స్వామీజీలు



ఆందోళనకు దిగిన అల్లరి మూకలను కట్టడి చేసేందుకు సిద్ధమైన కేంద్ర బలగాలు

అల్లరి మూకలను కట్టడి చేస్తాం

- కొత్తపేటలో కేంద్ర బలగాల మాక్ డ్రిల్
- కౌంటింగ్ సమయంలో అన్ని పార్టీలు సమన్వయం పాటించాలి
- కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ



కొత్తపేట, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ఇక 24 గంటలు మాత్రమే. ఈ నేపథ్యంలో ప్రజలను చైతన్యపరిచేందుకు పోలీసులు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. ఓట్ల లెక్కింపు రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెక్షన్ 144, 30 యాక్టు అమలులో ఉంటాయని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన కొత్తపేటలో ఆదివారం పోలీసులు నిర్వహించిన సాహసోపేతమైన మాక్ డ్రిల్ ఆలోచింపజేసింది. కౌంటింగ్ రోజున అల్లరిమూకలు ఆందోళనకారుల రూపంలో పోలీసు చర్యలను అడ్డుకుంటే ఏ విధంగా కట్టడి చేస్తారో ప్రత్యక్షంగా చేసి చూపించారు. పాత బస్టాండు సెంటర్లో డ్రైన్ డిఫెన్స్, డమ్మీ బుల్లెట్స్, బాష్పవాయువు, వాటర్‌గన్స్ తదితర రక్షణ పరికరాలను సీఐఎస్ఎఫ్ జవాన్లు ప్రయోగించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమణ మాట్లాడుతూ మంగళవారం కౌంటింగ్ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని, ప్రజలు శాంతియుతంగా ఉండాలన్నారు. విధ్వంసం సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అల్లర్లకు, నేరాలకు కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. భవిష్యత్తును పాడుచేసుకోకుండా రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాంతియుతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సారథి, రావులపాలెం సీఐలు ఎం.రామ్‌కుమార్, జేమ్స్‌రత్నప్రసాద్, ఎస్ఐలు ఎం.అశోక్, శ్రీను నాయక్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు

- ముమ్మిడివరం మండలం
- అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద ఘటన

29 మందికి గాయాలు... 7లో



ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రావెల్ బస్సు

● ఆర్టీసీ బస్సు డ్రైవరుతో పాటు మరో 29 మందికి గాయాలు



ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న దృశ్యం



క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న 108 సిబ్బంది



ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న క్షతగాత్రులు



ముమ్మిడివరం, జూన్ 2: ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న సంఘటనలో 29 మంది గాయపడ్డారు. ఈ సంఘటన 216 జాతీయ రహదారి ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జరిగింది. కాకినాడ నుంచి ప్రయాణికులతో వస్తున్న అమలాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న బొలేరో వ్యాన్‌ను తప్పించబోయి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవరుతో పాటు, మరో 25 మంది గాయపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో డ్రైవరుతో పాటు ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సులో 70 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. కాకినాడ నుంచి అమలాపురం వెళుతున్న మరో ఆర్టీసీ బస్సు కోరంగి వద్ద ఆగిపోవడంతో ఆ బస్సులో ఉన్న ప్రయాణికులను కూడా ప్రమాదానికి గురైన బస్సులోకి ఎక్కించడంతో బస్సులో 70 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. హైదరాబాద్ నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ బస్సులో గాయపడిన డ్రైవరుతో పాటు 25 మంది ప్రయాణికులను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వారిలో 12 మంది క్షతగాత్రులను అంబులెన్సులో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో అంబాజీపేటకు చెందిన డి.రామసీత, కాకినాడకు చెందిన జి.శ్రీనివాస్, భీమవరానికి చెందిన డి.జాన్‌బాబు, గుత్తెనదీవికి చెందిన సీహెచ్ కృష్ణవేణి, అమలాపురానికి చెందిన కె.సాయివేణి, అయినాపురానికి చెందిన ఎన్.కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్‌లో గాయపడిన డ్రైవరు, ఇద్దరు ప్రయాణికులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ బి.సురేష్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దు

● స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ రవిప్రకాష్
● లెక్కింపు ప్రాంతంలో మూడంచెల భద్రత: తూర్పు ఎస్పీ



ఓట్ల లెక్కింపు భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ రవిప్రకాష్

దివాన్‌చెరువు/రాజమహేంద్రవరం, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సెక్షన్ సీఆర్‌పీసీ, సెక్షన్ పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరూ ఉద్వేగపూర్వక, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్, ఓట్ల లెక్కింపు నిమిత్తం ఏలూరు రేంజ్‌కు ప్రత్యేకాధికారిగా నియమితులైన ఎం.రవిప్రకాష్ హెచ్చరించారు. ఆదికవి నన్నయ విద్యాలయాన్ని ఆదివారం ఎస్పీ పి.జగదీష్‌తో కలసి ఆయన ఆదివారం సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, బందోబస్తు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించకూడదన్నారు. అన్ని రాజకీయపార్టీల నాయకులు తమ కేడరు ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా చూసుకోవాలన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ ట్రయల్ రన్ ఆదివారం నిర్వహించామన్నారు. లెక్కింపు జరిగే ప్రాంతంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. లెక్కింపు కేంద్రం ఆవరణలో 152 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి కంట్రోల్ రూమ్ సిబ్బంది ద్వారా వాటిని మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. లెక్కింపు సిబ్బంది, ఏజెంట్లు, జనరల్ ఏజెంట్లు, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తామన్నారు. దీనికోసం 40 డీఎఫ్‌ఎండీఎస్, శిక్షణ పొందిన సిబ్బందిని నియమించామన్నారు. మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. లెక్కింపు సిబ్బందికి, ఏజెంట్లకు పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ద్వారా సూచనలిస్తామన్నారు. అత్యవసర ఏర్పాట్లలో భాగంగా అక్రమంగా గుమిగూడిన వారిని చెదరగొట్టడానికి వజ్రవాహనం, టియర్ గ్యాస్ ఎక్విప్‌మెంట్, అంబులెన్స్, ఫైరింజన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు. లెక్కింపు అనంతరం అవాంఛనీయ సంఘటనలను నిరోధించే క్రమంలో 129 సమస్యాత్మక గ్రామాలను, ప్రాంతాలను గుర్తించి ఆ ప్రదేశాల్లో 39 పోలీస్ పికెట్‌లు, 59 మొబైల్ పార్టీలను, 13 క్యూఆర్టీ బృందాలను నియమించామన్నారు. అభ్యర్థుల ఇళ్ల వద్ద, పార్టీ కార్యాలయాలవద్ద పికెట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు, మీడియా మిత్రులు పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

పవన్ మెజార్టీపై జాతీయస్థాయిలో ఉత్కంఠ

● ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి
● జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం, జూన్ 2: ఎన్నికల ప్రక్రియలో చివరి అంకమైన కౌంటింగ్‌లో ఏజెంట్ల పాత్ర కీలకమని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం శివారు గోకులం గ్రాండ్‌లో ఆదివారం సాయంత్రం కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సాధించబోయే మెజార్టీపై జాతీయస్థాయిలో ఉత్కంఠ ఉందని చెప్పారు. ఏ ఒక్క ఓటు కూడా లెక్క తప్పకుండా చూసుకోవాల్సిన బాధ్యత కౌంటింగ్ ఏజెంట్లపై ఉందని తెలిపారు. తాజాగా వెలువడిన ఎగ్జిట్‌పోల్స్ కూటమికి ప్రోత్సాహకరంగా ఉన్నాయని చెప్పారు. భీమవరంలో కౌంటింగ్ సమయంలో జరిగిన పొరపాట్లు కారణంగా నష్టపోయామని గుర్తుచేస్తే అటువంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఎప్పటికప్పుడు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ సందేహాలు కలిగితే వెంటనే ఆర్వోకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమావేశంలో జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, మర్రెడి శ్రీనివాస్, యాతం నగేష్, సందీప్ పాల్గొన్నారు.

కృష్ణబాబుకు ఘన నివాళి



మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



కృష్ణబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూన్ 2: కొవ్వూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పారిశ్రామికవేత్త పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) మృతికి పలువురు నేతలు సంతాపం తెలిపారు. ఆదివారం కొవ్వూరు మండలం దొమ్మేరులో జరిగిన కృష్ణబాబు దశ దిన కార్యక్రమానికి పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు విచ్చేసి కృష్ణబాబు సోదరుడు ది ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ చైర్మన్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)తో పాటు కృష్ణబాబు అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళుల ర్పించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, రాజమహేంద్రవరం పార్లమెంటు కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణంరాజు, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు, సినీ నిర్మాత కేఎల్ నారాయణ, కొవ్వూరు, గోపాలపురం కూటమి అభ్య ర్థులు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, గోపాలపురం ఎమ్మె ల్యే తలారి వెంకట్రావు, మాజీ మంత్రులు సీహెచ్ అయ్యన్నపాత్రుడు, కామినేని శ్రీనివాస్, కావూరి సాంబశివరావు, దొడ్డికర్ల సువర్ణరాజు, మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరామ్, టీవీ రామారావు, అవినాష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొర్రెల శ్రీధర్, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, ఇమ్మణి వీరశంకరం, కేవీకే రంగారావు పాల్గొని కృష్ణబాబుకు నివాళులర్పించారు.

విషపురుగు కాటుకు మహిళ మృతి



సామర్లకోట, జూన్ 2: కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ పరిధి కొత్తపేట భీమవరం ప్రాంతానికి చెందిన తాతపూడి మేరీ(44) ఆదివారం తెల్లవారుజామున విషపురుగు కాటుకు గురైంది. దీంతో కుటుంబసభ్యులు మేరీని సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స ప్రారంభించగా చికిత్స పొందుతూ మేరీ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సామర్లకోట పోలీసులు తెలిపారు.

మారేడుమిల్లిలో 378 టేకు చెట్ల కథ
కంచికేనా ?

● సరుకు దొరికేసింది, స్మగ్లింగ్ జరగలేదంటున్న అటవీ అధికారులు
● ఆదివాసీల పోడు వ్యవసాయం నేరమైతే, టేకు చెట్ల నరికివేత నేరం కాదా? ● ఇప్పటికే మారేడుమిల్లి భాగోతంపై ప్రభుత్వంవద్ద నివేదిక పెండింగ్
● అనుకూల ప్రభుత్వమే వస్తుందన్న ఆశలో అక్రమార్కులు



టేకు ప్లాంటేషన్‌లో విచారణ జరుపుతున్న అధికారులు (ఫైల్)

(రంపచోడవరం)

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైన మారేడుమిల్లి అటవీ ప్లాంటేషన్లలో అక్రమ నరికివేతకు గురైన 378 టేకు చెట్ల కథ కంచికి పోయినట్టే అన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రక్షిత అటవీ ప్రాంతంలోని టేకు ప్లాంటేషన నుంచి పెద్దఎత్తున చెట్ల నరికివేత, గల్లంతు భాగోతాలు వెలుగుచూసిన వెంటనే అటవీ శాఖకు చెందిన రాష్ట్ర ముఖ్య అధికారి ఆదేశాలతో సమగ్ర విచారణ ప్రారంభమైంది. రాజమండ్రి సీసీఎఫ్ పర్యవేక్షణలో ఇతర ప్రాంతాల డీఎఫ్‌వోలు, పలువురు సీనియర్ అధికారులతోపాటు విజిలెన్సు విభాగం కూడా విచారణ సాగించి నిగ్గు తేల్చింది. తొలుత 300 చెట్ల నరికివేతను గుర్తించగా, తర్వాత జరిగిన పలు విచారణలతో నరికివేసిన చెట్ల సంఖ్య 378కి చేరింది. ఈ నరికివేత వెనుక అటవీ శాఖ ఇంటిదొంగల పాత్రే కీలకంగా ఉందన్న సంగ తి అందరికీ తెలిసిందే! ఇందులో దొంగలను పట్టే పనికంటే నరికివేతకు గురైన చెట్లకు సరిపడ సరుకును గుర్తించి, దానిని రాబట్టి ప్రభుత్వానికి నష్టం చేకూరలేదన్న వాదనను వినిపించేందుకే అధికారులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

అటవీ చట్టం కింద కానీ, అటవీ సంరక్షణ చట్టం కింద కానీ అటవీ ప్రాంతంలో పర్యావరణ హితం కానీ ఏ వినాశనం జరిగినా అది నేరమే! రక్షిత అటవీ ప్రాంతం గుండా రెండు హెక్టార్లకు మించి కనీసం రహదారి కోసం కూడా అనుమతించవద్దని చట్టం చెబుతోంది. ఈ కారణంతోనే ఆదివాసీల సాంప్రదాయ పోడు వ్యవసాయాన్ని కూడా అటవీ అధికారులు నేరంగా పరిగణిస్తున్నారు. వందలాదిగా ఆదివాసీలు గత కొన్నేళ్లుగా పోడు వ్యవసాయం నేరం కింద నిందితులయ్యారు.. కానీ రక్షిత అటవీ ప్రాంతంలో టేకు ప్లాంటేషన్లలో వందలాదిగా చెట్లు నరికివేతకు గురైతే మాత్రం అది నేరం కాదన్న సంకేతాన్ని మారేడుమిల్లి టేకుచెట్ల భాగోతం ద్వారా అధికారులు ఇచ్చారు. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సును ఉపయోగించి ఇంటిదొంగలను సైతం పట్టాలని అటవీశాఖ రాజమహేంద్ర వరం సీసీఎఫ్ ఇచ్చిన ఉత్తర్వులనే ఇక్కడి అధికారులు ఖాతరు చేయని దుస్థితి.

ఇదిలావుండగా ఈ మొత్తం భాగోతంపై పలు నివేదికల ఆధారంగా రాష్ట్ర అటవీశాఖ ముఖ్య అధికారి ద్వారా ప్రభుత్వానికి సమగ్రంగా నివేదిక చేరినట్టు సమాచారం. ఎన్నికల కోడ్ కారణంగానే ఈ భాగోతం వెనుక ఉన్న అధికారులపై చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొందని సమాచారం. ఇందులో కొందరి అధికారుల గత చరిత్ర నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను నివేదించి తదుపరి నిర్ణయాన్ని ప్రభుత్వానికే వదిలేశారు. ఈ జాప్యాన్ని అనుకూలంగా మార్చుకునే పనిలో పడిన అధికారులు మాత్రం తమకు అనుకూలమైన ప్రభుత్వమే వస్తుందని, క్రింది అధికారులపై చర్యలతోనే ఇది ముగిసి పోతుందన్న ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

నెల కిందటే హత్య చేసి..పూడ్చిపెట్టి

● ఒమ్మంగి యువకుడి దారుణహత్య.. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు
● పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో మృతదేహం వెలికితీత



హత్యకు గురైన మొగలి సతీష్ (ఫైల్)

ప్రత్తిపాడు, జూన్ 2: కాకినాడ జిల్లాప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన మొగలి సతీష్(33)దారుణ హత్యకు గురయ్యాడు. దుండగులు సతీష్‌ను హతమార్చి ఉత్తరకంచి పొలాల్లో గుట్టుచప్పుడు కాకుండా పూడ్చివేశారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం ఉత్తర కంచిలోని ఘటనా ప్రదేశంలో మృతదేహాన్ని వెలికితీశారు. సంచలనంగా మారిన ఈ ఘటనపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన మొగలి సతీష్(33)కు పదేళ్లక్రితం ఒమ్మంగికి చెందిన మహిళతో వివాహమైంది. సతీష్ సింహాద్రిపురం నుంచి ఒమ్మంగి వచ్చి భార్యతో కలిసి ఉంటు న్నాడు. ఈ క్రమంలో మే 4న తన భర్త మొగలి సతీష్ అదృశ్యమయ్యాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు గత 29 రోజులుగా ము మ్మర దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు లోతుగా దర్యాప్తుచేసి సతీష్ హత్యకు గురైనట్లు కొనుగొన్నారు. మండలంలోని ఉత్తరకంచి, పొదురుపాక గ్రామాల మధ్య పంట పొలంలో హత్య చేసి పూడ్చివేసిన ప్రదేశాన్ని ఆదివారం ప్రత్తిపాడు తహసీల్దార్ నరసింహరావు, సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్, పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని నెలరోజుల క్రితం పూడ్చివేసిన మృతదేహాన్ని వెలికితీసి శవపంచనామా నిర్వహించారు. సతీష్‌ను ఎందుకు హతమార్చారు అనే దానిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వివాహేతర సంబంధంవల్ల జరిగిందా? లేదా పాత క్షకల నేపథ్యంలో సతీష్‌ను హతమార్చారా అనేది తెలియాల్సి ఉంది. సతీష్‌ను హతమార్చిన ఘటనలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏ ప్రభుత్వమొచ్చినా ఏముంది?

● రాష్ట్ర విభజనకు పదేళ్లు
● మన ఆస్తిని తెచ్చుకోలేని అసమర్థులం
● పోలవరం వదిలేశారు
● ప్రతిపక్షం ఉంటేనే ప్రజాస్వామ్యం
● మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్



రాజమహేంద్రవరం, జూన్2(ఆంధ్రజ్యోతి) : ఏప్రభుత్వం వచ్చినా ఇంతే. ఏముంది గర్వకారణం. రాష్ట్ర విభజన జరిగి ఆదివారం నాటికి పదేళ్ల పూర్త యింది. మనం మన ఆస్తిని కూడా తెచ్చుకోలేని అసమ ర్థులుగా ఉండిపో తున్నాం. ఇక ప్రభుత్వాలు ఎందుకు? అసలు ప్రొసీజర్‌ను పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ వ్యాఖ్యానించారు. రాజమ హేంద్రవరం ధర్మంచర హాల్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రతిపక్షం కూడా బలంగా ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజలు ఆవిర్భావ దినోత్సవ ఉత్సాహంతో ఉంటే, మనం దశాబ్ది గోసతో బాధపడుతు న్నామన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని వాటితో పాటు రాష్ట్రానికి రావలసిన వాటాను కోటా పొందడంలో ప్రస్తుతం విఫలమయ్యా మన్నారు. 2014-15లో కేంద్ర ప్రభుత్వం 32,625 కోట్ల ఆర్థిక లోటును భర్తీ చేయవలసి ఉంది. కానీ 5,615 కోట్లే వచ్చింది. పోలవరం ప్రాజెక్టు 48 శాతం మాత్రమే పూర్తయింది. ఇది రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఇక కేవలం 521 కోట్లు మాత్రమే పోలవరానికి బాకీ ఉన్నట్టు కేంద్రం స్పష్టం చేసిందని వివరించారు. ఇక వెనుకబ డిన ప్రాంతాలు, వివిధ ప్రాజెక్టుల కింద ఏడేళ్లలో 1500 కోట్లు ఇచ్చారు. కానీ ఇంకా 3,520 కోట్లు రావలసి ఉంది. దీనికి కారణం రాష్ట్రంలో కేంద్రం మీద ఒత్తిడి చేసే ప్రభుత్వమే లేదన్నారు. తెలంగాణ నుంచి ఏపీకి లక్షా 28 వేల కోట్ల విలువైన ఆస్తులు రావాలి. సుమారు లక్షా 60 వేల మంది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏ రాష్ట్రం ఇవ్వాలో అర్థంకాని పరిస్థితిలో వారు నష్టపోయారని తెలిపారు. తెలంగా ణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి ఇవి సాధించుకోవడానికి సరైన సమయం అని అన్నారు.

తలుపులమ్మా.. శరణు

● భక్తజన సందోహంగా లోవ క్షేత్రం
● ఒక్కరోజే రూ.5.07 లక్షల ఆదాయం



ఆరుబయట వంటావార్పు చేసుకుంటున్న భక్తులు

తునిరూరల్, జూన్ 2: తలుపులమ్మ లోవ క్షేత్రం ఆదివారం భక్తజనసందోహంగా మారింది. ఆలయానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని కనులారా తిలకించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన లోవ భక్తులు ఆలయప్రాంగణం మామిడితోటల్లో, ఆలయ వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు సౌకర్యార్థం ఆలయ అధికారులుప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లోవ కూడలిలో రద్దీగా మారిన వాహన ట్రాఫిక్‌ను రూరల్ పోలీసులు నియంత్రించి వాహన రాకపోకలు చక్కబెట్టారు. ఆదివారం ఒక్కరోజు లోవకు తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.5.07లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు తెలిపారు

దగ్గుబాటి దంపతులను కలిసిన నల్లమిల్లి, వేగుళ్ల



రాజమహేంద్రవరంలో దగ్గుబాటి దంపతులను సత్కరిస్తున్న ఎన్డీయే కూటమి అనపర్తి, మండపేట అభ్యర్థులు నల్లమిల్లి, వేగుళ్ల

అనపర్తి, జూన్ 2: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులను అనపర్తి, మండపేట కూటమి అభ్యర్థులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం రాజమహేంద్రవరంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మంగళవారం జరగనున్న కౌం టింగ్ సందర్భంగా వీరు దగ్గుబాటి దంపతులతో చర్చించారు. ఆపై వారిని సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా పురందేశ్వరి, అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా తన విజయం తథ్యమని, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, కేంద్రంలో నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపడతారని అన్నారు.

తగ్గుతున్న కర్ర పెండలం సాగు

● పామాయిల్ తోటల సాగుకు పయనం
● 5 వేల ఎకరాలకు మాత్రమే పరిమితమయ్యే ప్రమాదం



నాణ్యమైన దుంపవిత్తనం కర్రను సేకరిస్తున్న రైతులు

సామర్లకోట, జూన్ 2 : రాష్ట్రంలో కర్ర పెండలం దుంపసాగు చేసే ఏకైక జిల్లాగా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా జాతీయస్థాయిలో పేర్గాంచగా ఆ పంట దిగుబడులకు డిమాండ్ లేకపోవడం, సాగు వ్యయం ఏడాదికేడాది పెరిగిపోవడంతో పలువురు రైతులు కర్ర పెండలం సాగు చేసేందుకు అంతగా ఆశక్తి కనబర్చడంలేదు. ప్రతీఏటా జూన్ నెల మొదటి వారంలో వర్షాలు కురిసినా, కురవకపోయినా దుంప ముచ్చు కర్రలను విత్తనం నారుమడులుగా దుంప రైతులు సన్నద్ధం చేసేవారు. ఈ వారంలో రెండు దఫాలు భారీ వర్షాలు కురిసినా భూములను దుంపసాగుకు సన్నద్ధం చేసేందుకు అంతగా ఆశక్తి కనబర్చకపోవడం అత్యంత విచారకరం. మూడేళ్ల క్రితం వరకూ జిల్లాలో సుమారు 50వేల ఎకరాల వరకూ కర్ర పెండలం దుంప పంట సాగయ్యేది. ఈ ఏడాది జూలై నెలాఖరు నాటికి కేవలం 5వేల ఎకరాలలో మాత్రమే కర్ర పెండలం దుంప పంట సాగు చేసేందుకు అతి తక్కువమంది రైతులు మాత్రమే ముందుకొస్తున్నారని ఆంధ్రా శాగో మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. కర్ర పెండలం దుంప ఆధారంగా సగ్గుబియ్యం తయారుచేసే పరిశ్రమలు రాష్ట్రంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాలలోనే కేంద్రీకృతమైఉన్నాయి. ఒకప్పుడు 38 సగ్గుబియ్యం కర్మాగారాలు ఉండేవి. నేడు కేవలం ఆరు సగ్గుబియ్యం మిల్లులకు మాత్రమే పరిమితం అయ్యాయి. మెట్ట ప్రాంతాలలో వర్షాధార పంటగా సాగవుతున్న ఈ కర్ర పెండలం దుంప సాగుకు ప్రత్యామ్నాయంగా అధికశాతం రైతులు పామాయిల్ తోటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఇక్కడి నేలలు పామా యిల్ తోటల సాగుకు అనుకూలంగా ఉండడమేగాక దిగుబడులకు అధిక ధర లభించడంతో కర్ర పెండలం దుంప సాగు స్థానంలో పామాయిల్ తోటల సాగుకు రైతులు ముందుకె ళుతున్నారు. పామాయిల్ విత్తన మొక్కలు విరివిగా లభిస్తే మొత్తం అంతా పామాయిల్ తోటల సాగు చేపట్టే అవకాశాలు ఉన్నాయని కర్ర పెండలం దుంప సాగుచేసే ఆనూరుకు చెందిన రైతు బండే కొండలరావు చెప్పారు. ఇదే నిజమైతే రానున్న కాలంలో కర్ర పెండలం దుంప సాగు జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే కనమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పాలక ప్రభుత్వాల వైఖరిల కారణంగా జిల్లాలో చెరకు పంట పూర్తిగా కనమరుగు అయిన విషయం విధితమే. అదే కోవకు కర్ర పెండలం దుంప పంట కూడా చేరనుంది.



విత్తనం కర్ర ముచ్చులను నారుమడులుగా వేసిన దృశ్యం

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

ముమ్మిడివరం, జూన్ 2: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. పెన్మెత్స జగ్గప్పరాజు ఆధ్వర్యంలో అర్చకులు వేదంగి పవన్‌శర్మ మంత్రోచ్చారణల నడుమ స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. సరిపెల్ల రామకృష్ణంరాజు, గంటి జాజి, కాజులూరి రామలింగేశ్వరరావు, మంత్రిప్రగడ వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

● తాత్కాలిక రక్షణ చర్యలతో ధాన్యాన్ని నిల్వ చేస్తున్న రైతులు ● వర్షాలు కురవడంతో రైతుల ఆందోళన

రైతుల ఆశ నెరవేరేనా! బొండాల ధర పెరిగేనా!

కె.గంగవరం, జూన్ 2: ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర రావాలని రైతు ఆశపడుతున్నారు. అయితే ముమ్మరంగా మాసూళ్లు జరుగుతున్నప్పుడు రైతు ఆశించిన ధర రావడంలేదు. అప్పుడు అంత డిమాండ్ ఉండటంలేదు. డిమాండ్ వచ్చిన తరువాత ధాన్యాన్ని నిల్వ చేసి అమ్ముకుంటుంటే మంచి ధర వస్తుంది. దీంతో రైతులు పంటలను నిల్వ చేసుకుంటున్నారు. అయితే వర్షాలు పడితే ధాన్యం పాడవుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈరబీ సీజన్‌లో రామచంద్రపురం డివిజన్‌లో బొండాలు(2636) రకం పండించారు. ఏప్రిల్‌లో బహిరంగ మార్కెట్‌లో బస్తా ధాన్యం రూ.1400 ప్రారంభమై మే నెలలో రూ.1500నుంచి రూ.1550 వరకు పలికింది. సాగు చేసిన రైతుల్లో 60శాతం మంది ధాన్యం విక్రయించుకున్నారు. మేనెలాఖరుకు రూ.1700 వరకు పెరిగింది. ఏప్రిల్, మే నెలల్లో ముమ్మరంగా మాసూళ్లు జరగడంతో రైతులు పంటను కల్లాల్లోనే విక్రయించుకున్నారు. కొందరు రైతులు పొలం గట్టుపైన, దిమ్మలపైన, రహదారి ప్రక్కన రాశులుపోసిధర కోసం ఎదురుచూస్తున్నారు. 75కిలోల బస్తా ధాన్యం రూ.1800కు పైబడి ధర వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. వాతావరణంలో మార్పుతో వర్షాలు కురవడం రైతులు ఆందోళన చెందుతున్నారు. రాశులుల్లోకి నీరు చేరితే ధాన్యం పాడవుతుందని ఆందోళన చెందుతున్నారు.





కె.గంగవరం - అంగర రహదారిలో పామర్రు వద్ద రోడ్డు ప్రక్కన, పామర్రులో రోడ్డుపై వేసిన ధాన్యం రాశులు, యండగండిలో దిమ్మపై నిల్వచేసిన ధాన్యం రాశులు

అధ్వానంగా పాశర్లపూడి జాతీయ రహదారి



మామిడికుదురు: పాశర్లపూడిలో అధ్వానంగా తయారైన రోడ్డు,



అల్లవరం: దేవగుప్తంలో వర్షపు నీటితో ఆర్‌అండ్‌బీ రోడ్డు

మామిడికుదురు, జూన్2: పాశర్లపూడిలోని 216 జాతీయ రహదారి రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అధ్వానంగా తయారై ప్రమాదకరంగా మారింది. పాశర్లపూడి కొండాలమ్మ చింత నుంచి కైకాలపేట వరకు జాతీయ రహదారి పెద్దపెద్ద గోతులు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షం నీరు గోతుల్లో చేరడంతో ప్రమాదకరంగా మారాయి. నిత్యం ఈరహదారిపై అమలాపురం వెళ్లే ప్రయాణికుల వాహనాలతో రద్దీగా ఉంటుంది. కిలో మీటరు మేర గోతులు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ అప్పుడప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నారు. గోతులను ఆధునికీకరించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

వర్షాలకు అధ్వానంగా రహదారులు

అల్లవరం, జూన్2: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో పలు రోడ్లు అధ్వానంగా మారాయి. పలుచోట్ల గోతుల్లో వర్షం నీరు నిలిచిపోయింది. దేవగుప్తం, తాడికోన, యెంట్రుకోన, బోడసకర్రు, ఓడలరేవు, కొమరగిరిపట్నం గ్రామాల్లోని రోడ్లు వర్షాలకు దెబ్బతిని వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గుడ్డివానిచింత నుంచి దేవగుప్తం వెళ్లే రహదారి నిర్మాణం ఆగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కంకర రోడ్డు బురదమయం



బురదమయంగా లూటుకుర్రు, బాడిలంక కంకర రోడ్డు

మామిడికుదురు, జూన్ 2:లూటుకుర్రు నుంచి బాడిలంక వెళ్లే కంకర రోడ్డు బురదతో నిండిపోయి మట్టి రోడ్డుగా దర్శనమిస్తోంది. వేసవిలో మట్టి ట్రాక్టర్లు ఈరోడ్డుపై ఇష్టారాజ్యంగా తిరగడంతో రోడ్డుపై పడిన మట్టి రెండు రోజులుగా కురిసిన వర్షాలకు బురదగా తయారై కంకర రోడ్డు మట్టిరోడ్డుగా మారిపోయింది. 500మీటర్ల మేర రోడ్డు బురదమయం కావడంతో ఈరోడ్డుపై వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కంకర రోడ్డుపై చేరిన మట్టిని తొలగించి ఇబ్బందులను గట్టెక్కించాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



కె.గంగవరం పోలీసు స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

అమలాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు ఆదివారం పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు, పామర్రు ఎస్ఐ ఎస్‌కే జానీ, ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర, రాయవరం ఎస్ఐ జి.నగేష్ ఆధ్వర్యంలో ఆయా పోలీసు స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, తాలూకా సీఐ పి.వీరబాబు, ఎస్ఐలు జి.హరీష్‌కుమార్, కేఎం జోషి ఆధ్వర్యంలో సీఐ కార్యాలయం వద్ద కౌన్సిలింగ్ చేశారు. ఓట్ల లెక్కింపులో భాగంగా రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు దిగినా, చట్టాన్ని ఉల్లంఘించినా నగర బహిష్కరణ, పీడీ యాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా ఆదేశాల మేరకు రామచంద్రపురం సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో ఆదివారపుపేటలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి 12 డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. రావులపాలెం మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి స్థానికులతో సమావేశాలు జరిపారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యే విధంగా ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎవరైనా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అల్లర్లకు దిగితే పీడీ యాక్టు అమలు

అమలాపురం టౌన్, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా రౌడీషీటర్లు అల్లర్లకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తాలూకా సీఐ పి.వీరబాబు హెచ్చరించారు. అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం తాలూకా సీఐ కార్యాలయం ప్రాంగణంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్లు హద్దుమీరి వ్యవహరిస్తే నగర బహిష్కరణతో పాటు పీడీ యాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐలు వై.శేఖర్‌బాబు, జి.హరీష్‌కుమార్, జోషి పాల్గొన్నారు.

ఇద్దరు ఘరానా దొంగలు అరెస్టు.. చోరీ సొత్తు స్వాధీనం



చోరీ సొత్తు, నిందితులతో ఎస్పీ, సీఐ, ఎస్ఐ తదితరులు

యానాం, జూన్2: యానాం మున్సిపాల్టీ మెట్టకుర్రు వార్డు పరిధిలో గణపతినగర్‌లో నాలుగు రోజులు క్రితం, నవాజ్ కాలనీలో పది రోజుల క్రితం ఇద్దరు దొంగలు తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి టీవీలు, సిలిం డర్లను అపహరించారు. వీటిపై బాధితులకు యానాం పోలీ సులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీ సులు ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. ఆదివారం చోరీలకు సంబంధించి వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఇందుకు సంబదించిన వివరాలను యానాం ఎస్పీ మీడియాకు వివరించారు. యానాం సీఐ షణ్ముగం ఆధ్వర్యంలో ఎస్ఐ మురగనందం శనివారం కాకినాడకు చెందిన చిప్పల దుర్గాప్రసాద్, యానాం మున్సిపాల్టీ మెట్టకుర్రుకు చెందిన డొంక వీరబాబులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.37లక్షల విలువైన దివాన్‌కాట్, మూడు గ్యాస్ సిలిండర్లు, మూడు ఎల్ఈడీ టీవీలు, వాషింగ్‌మిషన్, గ్యాస్‌స్టవ్, మిక్సర్, ఐరాన్ బాక్సు, ట్రాలీ బ్యాగ్, ఫ్రిడ్జ్, ల్యాప్‌ట్యాప్, టేబుల్‌ఫ్యాన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించిందన్నారు. చోరీ కేసులను ఛేదించిన పోలీసు, క్రైం సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారు. కాకినాడ నుంచి గుట్కా ప్యాకెట్లను తీసుకువచ్చి యానాంలో విక్రయిస్తున్న కోలంకకు చెందిన వాకపట్ల శివను అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. రూ.15,875 విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించింది.

కొండలుగా చెత్త గుట్టలు..



అమలాపురం శ్మశానవాటిక చెంతన కొండలను తలపిస్తున్న చెత్త గుట్టలు

అమలాపురం టౌన్, జూన్ 2: అమలాపురం నల్లవంతెన దిగువన బైపాస్ రోడ్డులో వెళుతుంటే కొండల మాదిరిగా గుట్టలు దర్శనమిస్తున్నాయి. అదంతా అమలాపురం పట్టణంలో సేకరించిన చెత్తే. పట్టణంలో చెత్త సమస్యపై ప్రజలు ఎన్నో సమరాలు చేశారు. దశాబ్దాల కాలంగా చెత్త పేరుకుపోయి కొండంత గుట్టలుగా మారిపోయాయి. ఎట్టకేలకు అమలాపురం పురపాలక సంఘం హిందూ శ్మశాన వాటిక చెంతన ఉన్న కంపోస్టు యార్డులో చెత్తను పూర్తిగా తొలగించేందుకు కంకణం కట్టుకుంది. ఆ చెత్తను బయో మైనింగ్ చేసే విధంగా ఓ కాంట్రాక్టు సంస్థకు పనులు అప్పజెప్పారు. ప్రత్యేక యంత్రాల ద్వారా చెత్తను ఆరు రకాలుగా విభజిస్తున్నారు. చెత్త నుంచి మట్టితో పాటు ప్లాస్టిక్, గాజు వంటి ఇతర వ్యర్థాలను వేరు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. ఓ పక్క పాత చెత్త కొండలు తరుగుతుంటే బయో మైనింగ్‌తో వేరు చేయబడ్డ మట్టి, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు కొండల్లా పెరిగిపోయాయి. ఆ గుట్టలు రోడ్డెక్కడమే కాకుండా విద్యుత్ స్తంభాలను సైతం చుట్టుముట్టేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు కురవడంతో ఆ వ్యర్థాలన్నీ సమీపంలో ఉన్న ప్రధాన పంట కాల్వలోకి కరిగి జారిపోతుంది.

రోజుకు 30టన్నుల చెత్త:

అమలాపురం పురపాలక సంఘం నుంచి రోజుకు 30 టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. బయో మైనింగ్ ద్వారా వచ్చిన మట్టిని పురపాలక సంఘం అధీనంలోని పలు లోతట్టు ప్రాంతాలను మెరక చేసేందుకు వినియోగించామన్నారు. ఇక ప్లాస్టిక్, గాజు వంటి ఇతర వ్యర్థాలను కాంట్రాక్టు సంస్థ సిమెంట్, ఇతర ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. గతంలో కొండలుగా పెరిగిపోయిన చెత్తనంతటినీ పూర్తిగా తొలగించి ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని చూస్తున్నటట్టు కమిషనర్ తెలిపారు. ఆ వ్యర్థాలను తరలించే బాధ్యత కాంట్రాక్టు సంస్థదేనన్నారు.



కుమ్మరి కాల్వగట్టుపై చెత్తను తగలబెట్టడంతో ముంచెత్తుతున్న పొగ

తగలబెట్టేస్తున్నారు..

ఓ పక్కన చెత్తను బయో మైనింగ్ చేస్తుంటే మరో పక్కన ఏరోజుకారోజు వస్తున్న చెత్తను కుమ్మరి కాల్వ డ్రెయిన్ గట్టుపై పోస్తున్నారు. అక్కడితో ఆగకుండా ప్రజారోగ్యాన్ని సైతం పట్టించుకోకుండా తగలబెట్టేస్తున్నారు. దీంతో బైపాస్ రోడ్డుపై వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను అంటించడం ద్వారా వస్తున్న పొగ సమీప ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి, కళాశాలల్లోకి వెళ్లిపోతుండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ఆ పొగ పట్టణ పరిధిలోని పలు వీధులు, మెయిన్‌రోడ్ల వరకు సైతం వ్యాపిస్తుంది. పట్టణంలో సేకరించిన ఎన్నో రకాల వ్యర్థాలకు నిప్పుపెట్టడం ద్వారా వస్తున్న పొగను పీలిస్తే ప్రజారోగ్యం దెబ్బతింటుందని తెలిసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

పరామర్శ

అమలాపురం టౌన్, జూన్ 2: మాతృ వియోగంతో బాధపడుతున్న జాతీయ టొబాకో బోర్డు మాజీ ఛైర్మన్ బీఆర్కే నాయుడును ఆదివారం పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పరామర్శించారు. సావిత్రి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శులు అయితాబత్తుల సుభాషిణి, మాచవరపు శివన్నారాయణ, ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీను, యార్లగడ్డ రవీంద్ర, అయితాబత్తుల కుమార్‌సింగ్, కుడుపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి కల్యాణం

కె.గంగవరం, జూన్ 2: కోటిపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామివారికి సువర్చలా దేవికి కల్యాణంనిర్వహిచారు. వి.వెంకటసత్యదుర్గా ప్రసాద్ దుర్గాభవాని దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు శాస్త్రోక్తంగా స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామి వారి కల్యాణం తిలకించారు.

అంగరలో మట్టి తవ్వకాలు

కపిలేశ్వరపురం, జూన్ 2: అంగరలో మట్టి అక్రమ తవ్వకాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అంగర గ్రామపరిధి ఓఎన్జీసీ రోడ్డు సమీపంలో వ్యవసాయ భూముల్లో ఆదివారం అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. వీఆర్వో నాగమణి తదితరులు ఘటనా స్థలానికి చేరుకోగా ట్రాక్టరు డ్రైవరు పరారయ్యాడు. దీనిపై అంగర పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని అంగర పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు వీఆర్వో తెలిపారు. ఈఘటనపై మైనింగ్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు ఆమె తెలిపారు.

రహదారిని నిర్మించాలని నిరసన



రోడ్డుకు అడ్డుగా కర్రలు పాతి నిరసన తెలుపుతున్న స్థానికులు

అంబాజీపేట, జూన్2: మాచవరం పంచాయతీ పరిధి హైస్కూల్ సమీపంలోని శ్రీవినాయకవీధిలో అధ్వానంగా ఉన్న రహదారిని నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్న రహదారిని నిర్మించడంలేదన్నారు. ఈరహదారిపై నిత్యం రైతులు, విద్యార్థులు, ప్రజలు ప్రయాణిస్తుంటున్నారు. గోతులమయంగా మారిన అధ్వాన రహదారిలో ప్రమాదాలు జరుగతున్నాయన్నారు.గతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకు అంగీకరించినా రహదారి మార్గం తమదేనంటూ ఒక వ్యక్తి అభ్యంతరం చెప్పడంతో రహదారి నిర్మాణం నిలిచిపోయింది. ఆదివారం స్థానికులు, మహిళలు రోడ్డుకు అడ్డుగా కర్రలు పాతి రాకపోకలు నిలిపివేశారు. రహదారిని నిర్మించాలని డిమాండ్ చేశారు.

జోరుగా మద్యం అమ్మకాలు

ముందుగానే బెల్ట్‌షాపులకు మద్యం అమ్మిన సిబ్బంది

అల్లవరం, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రభుత్వం మూడు రోజుల పాటు లైసెన్స్ మద్యం షాపులకు బంద్ ప్రకటించింది. దీంతో దేవగుప్తం, అల్లవరం, బెండమూర్లంక, ఓడలరేవు, గోడితిప్ప గ్రామాల్లో మద్యం షాపుల వద్ద ఆదివారం భారీగా మద్యం అమ్మకాలు జరిగాయి. రోజువారీ టార్గెట్ అయిపోయిందని చెప్పి సిబ్బంది బెల్ట్ షాపుల నిర్వాహకులకు సీసాకు రూ.10 అదనంగా దొడ్డిదారిన మద్యం అమ్మేశారు. కొన్ని షాపుల వద్ద వివాదాలు తలెత్తాయి.



దేవగుప్తం ప్రభుత్వ మద్యంషాపు వద్ద బారులుతీరిన మందుబాబులు

విద్యార్థులకు ఉద్యోగాలు

బీవీసీలో ఘనంగా అచీవర్స్ డే



ఉద్యోగాలు పొందిన బీవీసీ ఇంజనీరింగ్ విద్యార్థులతో కృష్ణసతీష్ తదితరులు

అమలాపురం రూరల్, జూన్ 2: ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థుల్లో వెయ్యి మందికి పైగా మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని బీవీసీ కళాశాలల ఛైర్మన్ బోనం కృష్ణసతీష్ పేర్కొన్నారు. ఓడలరేవు, భట్లపాలెం, రాజమహేంద్రవరం బీవీసీ కళాశాలల్లో ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకున్న వెయ్యి మంది టెక్ మహీంద్ర, విప్రో, ఇన్ఫోసిస్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడంతో భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం అచీవర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ప్లేస్‌మెంట్ అధికారులు బొబ్బిలి మధుకుమార్, అడబాల కుమార్, వెంకటాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణసతీష్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు ప్రస్తుత పరిస్థితుల్లో తగ్గినప్పటికీ బలమైన ప్లేస్‌మెంట్ నెట్‌వర్క్ ఉండడంవల్లే ఇంతమంది విద్యార్థులు ఉద్యోగాలు దక్కించుకున్నారని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలోనే పలువురికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, డీన్ టీవీ జనార్దనరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బండారు ఫణిశంకర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ అందే రాజగోపాల్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

యానాం, జూన్ 2: పుదుచ్చేరి పార్లమెంట్ పరిధి యానాం నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి పరిశీలకుడిగా రాకేష్ కుష్‌ను ఎన్నికల కమిషన్ నియమించింది. ఆదివారం రాత్రి ఆయన యానాం చేరుకున్నారు. యానాం ప్రభుత్వ అతిథి గృహం వద్ద యానాం అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముంగ, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. బందోబస్తు కోసం పుదుచ్చేరి నుంచి 25మంది ఆదివారం రాత్రి యానాం చేరుకున్నారు.

పదో తేదీలోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేసుకోవాలి

అమలాపురం టౌన్, జూన్ 2: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని జిల్లా కన్వీనర్ ఎంవీజీ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు కాకినాడ, జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐలతో పాటు అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో పదో తేదీ సాయంత్రం 5గంటలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు.

సంప్రదాయబద్ధంగా సారె



అమ్మవార్లకు సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు

అమలాపురం రూరల్, జూన్ 2: బండారులంక శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి తీర్థ కల్యాణ మహోత్సవాల ముగింపులో భాగంగా ముత్తయిదువులు ఆదివారం స్వామి, అమ్మవార్లకు సంప్రదాయబద్ధంగా చీర, సారె సమర్పించారు. మంగళవాయిద్యాలు, గోవిందనామస్మరణ మధ్య మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, మిఠాయిలతో ఊరేగుతూ స్వామివారి సన్నిధికి చేరుకున్నారు. ఆలయ అర్చకుడు బీరక భీమేశ్వరరావు అర్చకత్వంలో సారెను శాస్త్రోక్తంగా సమర్పించారు. విశేష పూజలు జరిపారు. అనంతరం ముత్తయిదువులు ఇంటింటికీ తిరిగి సారెను పంచారు. కార్యక్రమంలో బిళ్ల లక్ష్మీకుమారి, అంకం సత్యలక్ష్మి, నల్లా జయ, బిళ్ల భద్రకాళి, పిచ్చిక జ్యోతి, నల్లా వెంకటసత్యనారాయణమ్మ, దొమ్మేటి దుర్గ, బాసిన భారతి పాల్గొన్నారు.

సుదర్శన హోమానికి రూ.లక్ష విరాళం

అంతర్వేది, జూన్ 2: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి నిత్య సుదర్శన హోమానికి ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన కె.శ్రీనివాసకుమార్-పద్మావతి దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ పార్థసారధికి అందించారు. దాత దంపతులకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

అమ్మ ఫౌండేషన్ ద్వారా గ్రామాభివృద్ధిలో పూర్వవిద్యార్థులు



పూర్వ విద్యార్థి, మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న తోటి విద్యార్థులు

పి.గన్నవరం, జూన్ 2: మనం ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన ఊరును మరువకూడదనే లక్ష్యంతో పోతవరం మండలపరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు అమ్మ ఫౌండేషన్‌ను ఏర్పాటుచేసి సొంత గ్రామం, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆదివారం అమ్మ ఫౌండేషన్ అధ్యక్షురాలు యర్రా శేషకుమారి అధ్యక్షతన పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పాఠశాల అభివృద్ధికి రూ.3.50లక్షలు విరాళం అందించిన పూర్వ విద్యార్థి, మెట్రోకెమ్ వ్యవస్థాపకుడు నందెపు వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులను గజమాల, దుశ్శాలువాతో సన్మానించారు. పాఠశాలకు, గ్రామానికి ఆయన చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. పోతవరం గ్రామసచివాలయానికి ఇటీవల రూ.5లక్షలతో నందెపు వెంకటేశ్వరరావు ఫర్నిచర్‌ను సమకూర్చారు. వాటిని సర్పంచ్ వడలి కొండయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ పులపర్తి రాజా రావు, హెచ్‌ఎం కత్తుల ఆనందరావు, పూర్వ విద్యార్థులు కొండ్రెడ్డి బాలజీ, తెలగారెడ్డి విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.4.68లక్షలు

ఆత్రేయపురం, జూన్ 2: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి నర్సీపట్నానికి చెందిన అంకం గిరిబాబు రూ.50వేలు, ఉంగుటూరుకు చెందిన గాదే శ్రీనివాసరావు రూ.10,116 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజు ఆదాయం రూ.4,68,968 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

ఆత్రేయపురం, జూన్ 2: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు నీతి కథలు, వేమన పద్యాలు, బాలల సాహిత్యం నేర్పించారు. క్రాఫ్ట్‌కు చెందిన అనేక విషయాలను బోధించారు. గ్రంథాలయాధికారి నమ్మిశివాయ ఆధ్వర్యంలో పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం, జూన్ 2: స్థానిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి సోమవారం నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణా సుధాకర్ తెలిపారు. సెంటాక్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసువాలన్నారు. ఐటీఐలో చేరే ప్రతి విద్యార్థికి నెలకు రూ.వెయ్యి శిక్షణ భృతి, ప్రతి తరగతి టాపర్‌కు నెలకు రూ.వెయ్యి ప్రోత్సాహం, ఏటా రెండు జతల యూనిఫారం, ఒక వర్కింగ్ కోచ్, గుర్తింపుకార్డు, ఉచిత మధ్యాహ్న భోజనం అందజేస్తామన్నారు. బాలికలకు కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ ఏడాది కోర్సు, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ, బాలురకు ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్, ఎలక్ట్రీషియన్ రెండేళ్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. జూన్ 30లోగా అభ్యర్థులు దరఖాస్తులు చేయాలని, వివరాలకు ఐటీఐ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మహిళ మెడలో బంగారం తాడు చోరీ

అల్లవరం, జూన్2: బోడసకుర్రులో కనకదుర్గ గుడి వద్ద అడపా సూర్యావతి మెడలో ఉన్న బంగారు తాడును గుర్తుతెలియని వ్యక్తి లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, ఎస్ఐ హరీష్‌కుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేపట్టారు.

వేగుళ్లకు టీడీపీ, జనసేన నాయకుల అభినందనలు



వేగుళ్లను కలిసిన అభినందనలు తెలుపుతున్న టీడీపీ , జనసేన నేతలు

మండపేట, జూన్ 2: కొత్తపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, కపిలేశ్వరపురం మండలం వడ్లమూరు, మండపేట మండలం పాలతోడు, మండపేట పట్టణ 7వవార్డు కు చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులు ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో వేగుళ్ల గెలుపు తథ్యమని టీడీపీ, జనసేన నాయకులు అన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

కె.గంగవరం, జూన్ 2: కోట గ్రామంలోని రాజగోపాలస్వామి వారి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన వైద్యశాల వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పి.వి.రాఘవరావు ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నేడు రావులమ్మ జాతర

అంబాజీపేట, జూన్ 2: కె.పెదపూడి గ్రామదేవత శ్రీరాజరాజేశ్వరి రావులమ్మ సోమవారం రాత్రిఅమ్మవారి జాతర, మంగళవారం అమ్మవారి తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి జాతరలో గరగనృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

పంట కాల్వలో ఉప్పు నీరు



గోపాయిలంక పంట కాలువలో ఆక్వా చెరువు ఉప్పునీరు

అల్లవరం, జూన్ 2: మండలంలోని పలు పంట కాల్వలు ఆక్వా చెరువుల ఉప్పునీటితో నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. కాల్వల ద్వారా ఈకలుషిత నీరు చేలలో చేరితే ఖరీఫ్ నారుమడులు ఎలా పోసుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కాల్వలో ఆక్వా ఉప్పునీటి వల్ల గతంలో నారుమడులు దెబ్బతిన్నాయన్నారు. అల్లవరం, దేవగుప్తం, సామంతకుర్రు, తుమ్మలపల్లి, తూర్పులంక, బెండమూర్లంక, తాడికోన తదితర గ్రామాల్లో పంట కాల్వల్లో ఆక్వా రైతులు తోడేసిన కలుషిత ఉప్పునీరు చేరి రైతుల పాలిట శాపంగా మారింది. గతంలో రెండేసిసార్లు నారుమడులు పోయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న అధికారులు క్షేత్రస్థాయిలో పంట కాల్వలను పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఖరీఫ్ సాగు సక్రమంగా జరిగేలా పంట కాల్వల నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

వైభవంగా సత్తెమ్మతల్లి జాతర

మామిడికుదురు, జూన్ 2: రెండేళ్లకు ఒకసారి నిర్వహించే గోగన్నమఠం గ్రామదేవత సత్తెమ్మతల్లి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తీన్‌మార్ డప్పులు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ఘనంగా జాతర జరిగింది. అమలాపురం పార్లమెంటు కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం, రాజోలు అభ్యర్థులు గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా జరిగిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1,0,116 విరాళం

మామిడికుదురు, జూన్2: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి గళ్లా పవన్‌కుమార్-అనీష దంపతులు రూ.1,0,116 విరాళం అందించారు. దాత దంపతులకు సిబ్బంది స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు. బొక్కా సత్యంమూర్తి, గొడవర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హరీష్‌మాధుర్‌కు అభినందనలు

అమలాపురం టౌన్, జూన్ 2: అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌ను జిల్లా కార్పెంటర్ల సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సంఘీయులు ఆదివారం క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. మందుస్తుగా అభినందనలు తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	:గంగం గణేశా
శ్రీలలిత	:హిట్‌లిస్ట్
శేఖర్ స్క్రీన్-1	:రాజు యాదవ్
శేఖర్ స్క్రీన్-2	: ఆ ఒక్కటీ అడక్కు
రమా	:గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	:బాక్
వెంకటపద్మావతిస్క్రీన్-1	:భజే వాయువేగం
వెంకటపద్మావతి స్క్రీన్-2	:లవ్ మీ